10,11 తేదీలలో జేఎన్టీయూలో మెగా జాబ్ మేళా

అబిడ్స్, ఆగస్టు 5: నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించేందుకు గాను ఈ నెల 10, 11వ తేదీలలో జేఎన్టీయూ మెగా జాబ్ మేళాను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరవస్తు మధుకర్ స్వామి, జేఎన్టీయూ డైరెక్టర్ సురేశ్ కుమార్, పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ అధ్యక్షురాలు ప్రొఫెసర్ లక్ష్మి కుమారి, నిపుణ సుభద్రరాణి తెలిపారు. జేఎన్టీ యూనివర్శిటీ హైదరాబాద్, పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, నిపుణ హ్యూమన్ డెవలప్‌మెంట్ సొసైటీల నేతృత్వంలో ఈ మెగా జాబ్ ఫెయిర్‌ను కూకట్‌పల్లిలోని జేఎన్టీయూ క్యాంపస్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిప్లమా, ఐటీఐ, బీటెక్, ఎంటెక్, డిగ్రీ, పీజీ, బీ ఫార్మసి, ఎం ఫార్మసికి చెందిన 2016వ సంవత్సరం నుంచి 2024వ సంవత్సరం వరకు పాసైన విద్యార్థులు ఈ జాబ్ ఫెయిర్‌లో పాల్గొనవచ్చన్నారు. ఐటీ, ఐటీఈఎస్, మేనేజ్‌మెంట్, ఫార్మా, కోర్, బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ, రిటైల్ తదితర విభాగాలకు చెందిన వంద కంపెనీలు ఈ జాబ్ ఫెయిర్‌లో పాల్గొని పది వేలకు పైగా ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందని వివరించారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు ఫోన్ నం. 81212 12873, 73373 73575లలో సంప్రదించాలని కోరారు.

నిర్వహణపై హెచ్ఎండీఏ ఫోకస్

- సెంట్రల్ మీడియన్, పార్కుల అభివృద్ధి, చెరువుల సుందరీకరణ నిర్వహణపై దృష్టిపెట్టిన అధికారులు

సిటీబ్యూరో, ఆగస్ట్ 5(నమస్తే తెలంగాణ): పడకేసిన నిర్వహణపై హెచ్ఎండీఏ అధికారులు ఎట్టకేలకు దృష్టి సారించారు. హెచ్ఎండీఏ చేపట్టిన చెరువుల సుందరీకరణ నిర్వహణ కొంతకాలంగా ఆగిపోయింది. ఈ క్రమంలో హెచ్ఎండీఏ పలు దఫాల్లో చేపట్టిన ప్రాజెక్టుల నిర్వహణను గాడిలో పెట్టేలా టెండర్లకు పిలిచారు. హెచ్ఎండీఏ డెవలప్ చేసిన చెరువులతో పాటు, పార్కులు, ప్రధాన మార్గాల వెంబడి పచ్చదనం పెంచేలా కార్యాచరణ రూపొందించారు. గడిచిన మూడేళ్ల నుంచి హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న చెరువులను భారీ నిధులు వెచ్చించి అభివృద్ధి చేశారు. హెచ్ఎండీఏతో పాటు, పలు మున్సిపాలిటీలు కూడా చెరువులు, కుంటలను అభివృద్ధి చేశాయి. ఈ క్రమంలో హెచ్ఎండీఏ చేపట్టిన అభివృద్ధి పనుల నిర్వహణపై దృష్టి సారించి పనులను ముమ్మరం చేశారు. రోడ్లకు ఇరువైపులా మొక్కల పెంపకం, మీడియన్ వెంబడి గ్రీనరీ పెంచేందుకు ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇక పార్కులలోనూ ఈ తరహా అభివృద్ధి పనులు చేపట్టేందుకు సన్నాహాలు చేశారు. వచ్చే నెల నుంచి హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న చెరువులు, పార్కులు, ప్రధాన మార్గాలలో గ్రీనరీ, చెరువుల నిర్వహణతో పాటు పలు కార్యక్రమాలు మొదలు కానున్నట్లుగా అధికారులు వెల్లడించారు.

మామిడి హరికృష్ణకు పదోన్నతిపై హర్షం

హైదరాబాద్, ఆగస్టు 5(నమస్తే తెలంగాణ): భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ జాయింట్ రిజిస్ట్రార్ పదవి నుంచి అడిషనల్ రిజిస్ట్రార్‌గా పదోన్నతి పొందారు. సహకార శాఖలో పదోన్నతి పొందినప్పటికీ సాంస్కృతిక శాఖ సంచాలకుడిగానే కొనసాగుతారని ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తెలంగాణ కో ఆపరేటివ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ మోహన్ రావు, ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస మూర్తి, సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

'సాగర్'ను తిలకించేందుకు ప్రత్యేక బస్సులు

సుల్తాన్‌బజార్, ఆగస్టు 5: నాగార్జున సాగర్ డ్యామ్ గేట్లు తెరిచే సుందర దృశ్యాన్ని తిలకించేందుకు ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేకంగా బస్సులను నడుపుతున్నట్లు రంగారెడ్డి రీజియన్ రీజనల్ మేనేజర్ శ్రీలత సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సందర్శకుల సౌకర్యార్థం ఎంజీబీఎస్ నుంచి నాగార్జున సాగర్ వరకు నల్గొండ డిపో ఆధ్వర్యంలో ఉదయం 5, 6.45, 7.15, 7.30, 8, 9.45, 10.45, మధ్యాహ్నం 2.30, సాయత్రం 5, 5.40 నిమిషాలకు బస్సులను నడుపుతున్నట్లు ఆమె వివరించారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రసాయనిక రంగానికి ఐఐసీటీ పవర్ హౌజ్



డా.రామ్ విశ్వకర్మకు సన్మానం చేస్తున్న ఐఐసీటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

సిటీబ్యూరో, ఆగస్టు 5(నమస్తే తెలంగాణ): రసాయనిక రంగంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ దేశానికి పవర్ హౌజ్ లాంటిదని ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ రామ్ విశ్వకర్మ అన్నారు. ఐఐసీటీలో సోమవారం జరిగిన సీఎస్ఐఆర్-ఐఐసీటీ 81వ వ్యవస్థాపక దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, దేశానికి అత్యున్నతమైన టెక్నాలజీని, శాస్త్రీయ విజ్ఞానాన్ని అందించడంలో ఐఐసీటీ ఎంతగానో కృషి చేస్తుందన్నారు. బయోలాజికల్ ప్రక్రియలో ముఖ్యమైన పాత్రను పోషించే గ్లెకో సైల్ ఫాస్ఫాటి డైలినోసిటోల్ (జీపీఐ-యాంకర్డ్)గా అధ్యయనంలో ఐఐసీటీ ఎనలేని సేవలు అందిస్తుందన్నారు. ముఖ్య అతిథితో కలిసి ఐఐసీటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ ప్రసంగించారు. ఎనిమిది దశాబ్దాలు ఐఐసీటీ ఎన్నో మైలురాళ్లను అధిగమించారన్నారు. అనంతరం, శాస్త్రవేత్తగా డా.రామ్ విశ్వకర్మ సాధించిన విజయాలను, సీఎస్ఐఆర్-ఐఐఐఎం మాజీ డైరెక్టర్‌గా ఎన్నో పరిశోధనల్లో ముఖ్య పాత్రను పోషించినట్లుగా తెలిపారు. కార్యక్రమంలో రీసెర్చ్ కౌన్సిల్ చైర్మన్ ప్రొ.జావెద్, సీసీఎంబీ డైరెక్టర్ డా.వినయ్ కుమార్ నందికూరి, ఎన్జీఆర్ఐ డైరెక్టర్ డా.ప్రకాష్ కుమార్ పాల్గొన్నారు.

జాతీయ ర్యాలీలో మహావీర్ డైరెక్టర్ విజయం

కోయంబత్తూరులో జరిగిన భారత జాతీయ ర్యాలీ ఛాంపియన్ షిప్ 2024లో మహావీర్ గ్రూప్ డైరెక్టర్ జీత్ జబఖ్ విజయం సాధించాడు. దేశ వ్యాప్తంగా అత్యుత్తమ ర్యాలీ డ్రైవర్లు ప్రదర్శించే ప్రీమియం మోటార్ స్పోర్ట్స్ వేవ్ 'బ్లూ బ్యాండ్ ఎఫ్ఎంఎస్‌సీఐ ఇండియన్ నేషనల్ ర్యాలీ ఛాంపియన్ షిప్‌లో ఈ ఘనత సాధించాడు. 36 మంది పోటీదారులను ఓడించి, రెండు సార్లు నేటియోమాల్ రేసింగ్ చామ్ గియోమ్ గేర్‌లను స్విచ్ చేసి మూడో రౌండ్లో విజయ పతాక ఎగురవేశాడు.

– జూబ్లీహిల్స్, ఆగస్టు 5

చిత్త శుద్ధి లేదా..?

హైదరాబాద్ ఓ విశ్వ నగరం. తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక దేశంలోని ప్రధాన నగరాలన్నింటిలో హైదరాబాద్‌కు ప్రత్యేక స్థానం సంతరించుకుంది. అలాంటి నగరంలో పారిశుధ్యం కొరవడి అపరిశుభ్ర వాతావరణం తాండవం చేస్తున్నది. పాలక, అధికార యంత్రాంగ విధి విధానాలకు నిదర్శనాలు ఇక్కడ కన్పిస్తున్న దృశ్యాలు. అసలే వర్షాకాలం, ఆపై ఎక్కడ చూసినా చెత్త, వ్యర్థాల సంచారం విచ్చల విడిగా చోటు చేసుకుంటున్నది. నగరం దుర్గంధభరితంగా తయారై వ్యాధులకు అలవాలమైంది. అయినా, పాలకులు, అధికారులు పట్టించుకున్న పాపానపోరు. ఇక్కడ అగుపిస్తున్న ఈ దృశ్యాలు సోమవారం సికింద్రాబాద్ పరిధి జీరా, మేకల మండి ప్రాంతంలోనివి.

తల్లిదండ్రులను పిల్లలు గౌరవించాలి

అవార్డు గ్రహీతలకు పురస్కారాలను బహూకరిస్తున్న విద్యాశంకర భారతి, డాక్టర్ కేవీ రమణాచారి

రవీంద్రభారతి, ఆగస్టు 5: వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను గౌరవించాలని, కుమారులు ఎంత ఎత్తు ఎదిగినా తల్లిదండ్రుల వద్ద ఒదిగే ఉండి, తల్లిదండ్రులను ఆదుకోవాల్సిన అవసరం నేటి యువతరంపై ఉన్నదని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారుడు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. పిల్లల కోసం సర్వస్వాన్ని వెచ్చించి విద్యాబుద్ధులు చెప్పించి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దిన ఘనత తల్లిదండ్రులదేనన్నారు. శ్రీమాన్ కేవీ రాఘవాచార్యులు కడు పేదరికం నుంచి మమ్ముల్ని ఈ స్థాయికి తీసుకువచ్చారని రమణాచారి అన్నారు. కేవీ రాఘవాచార్యుల స్మారక పండిత పురస్కారాన్ని శ్రీమాన్ డా.శ్రీ పెరుంబుదూరు శ్రీరంగాచార్యులకు, డా. కేవీ రమణాచార్య స్ఫూర్తి పురస్కారాన్ని శ్రీభాష్యం శ్రావణ కుమార్‌కు బహూకరించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, తిరుమల ఛారిటిబుల్ ట్రస్ట్, సాధన సాహితీ స్రవంతి హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో సోమవారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో రాఘవాచార్యుల స్మారక పండిత పురస్కారాన్ని ప్రదానం చేశారు. పాలెం ప్రాచ్య కళాశాల పూర్వ ప్రధానాచార్యులు శ్రీమాన్ డా.శ్రీ పేరుంబుదూరు శ్రీరంగాచార్యులకు రాఘవాచార్యుల పురస్కారాన్ని బహూకరించారు. డాక్టర్ కేవీ రమణాచారి స్ఫూర్తి పురస్కారం భాష్యం శ్రావణ కుమార్‌కు బహూకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగద్గురువులు పుష్పగిరి పీఠాధిపతి అభినవోద్దండ విద్యాశంకర భారతి విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి పురస్కారాలను బహూకరించారు. విద్యాశంకర భారతి మాట్లాడుతూ శ్రీమాన్ కేవీ రాఘవాచార్యులు గొప్ప సాహితీవేత్త అని కొనియాడారు. కేవీ రాఘవచార్యులు అనేక పుస్తకాలు రాసిన గొప్ప మహనీయుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో కవి కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, డాక్టర్ మామిడి హరికృష్ణ, సాధన నరసింహాచార్య, కవి రఘుశ్రీ పాల్గొన్నారు.

దక్షిణ కొరియా పర్యటనకు హెచ్ఎండీఏ అధికారులు

- ఎంఏయూడీ ఉన్నతాధికారులతో కలిసి ఈ నెల 8న అధికారుల ప్రయాణం
- అర్బన్, మూసీ రివర్ డెవలప్‌మెంట్ అంశాలపై సీఎంతో అధ్యయనం చేయనున్న అధికారులు

సిటీబ్యూరో, ఆగస్ట్ 5(నమస్తే తెలంగాణ): విదేశీ పర్యటన కోసం అమెరికా వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డితో పాటు హెచ్ఎండీఏ అధికారులు కూడా బయలుదేరనున్నారు. మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులతో పాటు, హెచ్ఎండీఏకు చెందిన ప్రధాన అధికారులు వెళ్లనున్నట్లుగా తెలిసింది. ఈ నెల 14 వరకు అమెరికాతో పాటు, దక్షిణ కొరియాలో పర్యటించనుండగా, ఈ నెల 8 నుంచి హైదరాబాద్ నుంచి ఎంఏయూడీ బృందం బయల్దేరనుంది. మూసీ, అర్బన్ డెవలప్‌మెంట్ అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలో అర్బన్ డెవలప్‌మెంట్‌లో కీలకమైన ఎంఏయూడీ ఉన్నతాధికారులు, హెచ్ఎండీఏ అధికారులు కూడా ఈ పర్యటనలో పాల్గొంటారని తెలిసింది. హైదరాబాద్ హెచ్ఎండీఏ బృందం నుంచి 10న బయల్దేరనుండగా, యూఎస్ నుంచి దక్షిణ కొరియాకు సీఎం రేవంత్ రెడ్డి వెళ్లిపోనున్నారు. ఆ లోపు కార్యక్రమాల షెడ్యూల్, సందర్శించే ప్రదేశాలపై అధికారుల బృందం ఏర్పాట్లను పర్యవేక్షించనున్నట్లుగా తెలిసింది. నగర, పట్టణాభివృద్ధి, వేస్ట్ మేనేజ్‌మెంట్, రవాణా, ఎలివేటెడ్ కారిడార్లు, మౌలిక వసతులకు సంబంధించిన ప్రాజెక్టులను చేపట్టే సంస్థలతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యే అవకాశం ఉందన్నాయి. ఈ పర్యటన బృందంలో ఎంఏయూడీ ఉన్నతాధికారులతో పాటు, హెచ్ఎండీఏ కమిషనర్ కూడా ఉన్నట్లుగా తెలిసింది.

కనీస వేతనాలు అమలు చేయాలి

- తెలంగాణ రాష్ట్ర స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్

ధర్నాలో మాట్లాడుతున్న అధ్యక్షుడు ఈశ్వర్ రావు

చిక్కడపల్లి, ఆగస్టు 5: గృహజ్యోతి పథకంతో ఉపాధి కోల్పోయిన విద్యుత్ బిల్ కలెక్టర్లకు, ఈఆర్వో, ఎస్ఈ, డీఈ కార్యాలయం అవకాశాలు కల్పించి ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ)అధ్యక్షుడు ఈశ్వర్ రావు డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో గృహజ్యోతితో ఉపాధి కోల్పోయిన విద్యుత్ బిల్ కలెక్టర్లకు ఉపాధి కల్పించాలని సోమవారం ధర్నా చౌక్‌లో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భగా అధ్యక్షుడు ఈశ్వర్ రావు మాట్లాడుతూ, ఉపాధి కోల్పోయిన విద్యుత్ బిల్ కలెక్టర్లను ప్రభుత్వం ఆదుకోవాలని, పీస్ రేట్ విధానం రద్దుచేసి లేబర్ కమిషన్ ఇచ్చిన జీవో నం.11 ప్రకారం, కనీస వేతనాలు నేరుగా చెల్లించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గృహ జ్యోతి పథకం 200 యూనిట్లకు జీరో బిల్ సిస్టమ్ అమలు చేసిన తరువాత చాలా మంది వినియోగదారులు బిల్లులు చెల్లించడం లేదన్నారు. బిల్లు కలెక్టర్లకు న్యాయం చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి వి.గోవర్ధన్, నాయకులు లక్ష్మణ్, కృష్ణయ్య, పి.నారాయణ, సోమేశ్ పాల్గొన్నారు.

అధికారుల తీరుపై అసంతృప్తి

దుండిగల్, ఆగస్టు 5: తెలంగాణ పురపాలక శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ వీపీ గౌతం సోమవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రగతినగర్‌లోని భగత్‌సింగ్ పార్కు, సర్వే నం.186లోని చెత్త డంపింగ్ యార్డుతో పాటు డబుల్ బెడ్ రూం ఇండ్లను పరిశీలించారు. చెత్త డంపింగ్ యార్డు నిర్వహణ పట్ల ఆయన స్థానిక అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్కుల మెయింటెనెన్స్ సైతం సరిగ్గా లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. అదే సమయంలో ఇటీవల కార్పొరేషన్ పరిధిలోని రాజీవ్‌గాంధీ నగర్‌లో చోటు చేసుకున్న ఇంటి నంబర్ల వ్యవహారం, అక్రమ ఇంటి నంబర్లపై ఆరా తీయడంతో పాటు స్థానిక కమిషనర్ పనితీరుపైనా అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తుంది. కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావుతో పాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ప్రగతినగర్‌లోని భగత్‌సింగ్ పార్కును పరిశీలిస్తున్న నీడీఎంఏ కమిషనర్ వీపీ గౌతమ్

సగరులం రాజకీయ చైతన్యాన్ని ప్రదర్శిస్తాం

సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సాగర్

కొండాపూర్, ఆగస్టు 5: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా సగరులం రాజకీయ చైతన్యాన్ని ప్రదర్శిస్తామని తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సాగర్ అన్నారు. గచ్చిబౌలిలోని సగర సంఘం రాష్ట్ర కార్యాలయంలో సోమవారం జరిగిన సగర సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం పలు కీలక నిర్ణయాలను తీర్మానించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు మెంబర్లుగా, సర్పంచులుగా, ఎంపీటీసీలుగా, జెడ్పీటీసీలుగా, ఎంపీపీలుగా జెడ్పీ చైర్మన్లుగా, కౌన్సిలర్లుగా కార్పొరేటర్లుగా, చైర్మన్లుగా రాష్ట్ర వ్యాప్తంగా పోటీ చేసి మెజారిటీ స్థానాలలో విజయం సాధించడం కొరకు ప్రయత్నాలు కొనసాగిస్తామన్నారు. వివిధ రాజకీయ పార్టీలో ఉన్న సగరులు రాబోయే ఎన్నికలకు సంసిద్ధం కావాలన్నారు. సగరులను విస్మయించే ఏ రాజకీయ పార్టీనైనా ఓడించడం కొరకు తమ ప్రయత్నాలు ఉంటాయన్నారు. వేలాది మందితో సగర చైతన్య సదస్సును నిర్వహిస్తామన్నారు. సగరులను చైతన్య పరిచే లక్ష్యంతో కాల పరిమితి పూర్తయిన జిల్లాలో త్వరలోనే తిరిగి నూతన కమిటీలను ఏర్పాటు చేసి సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ముత్యాల హరికిషన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌరక్క, రాష్ట్ర కోశాధికారి కుమార స్వామి, సంఘం ముఖ్య సలహాదారు ఆంజనేయులు, సగర ఆత్మ గౌరవ భవన వెల్ఫేర్ ట్రస్టు చైర్మన్ మారుతి సాగర్ తదితరులు ఉన్నారు.

పద్మారావునగర్‌లో ప్రచారం నిర్వహించిన అప్సా, టెక్ మహీంద్రా స్మార్ట్ సిబ్బంది, వలంటీర్లు

టెక్ మహీంద్రాలో ఉచిత కంప్యూటర్ శిక్షణ

బన్సీలాల్‌పేట్, ఆగస్టు 5: అప్సా, టెక్ మహీంద్రా ఫౌండేషన్ స్మార్ట్ కేంద్రంలో ఉచిత నైపుణ్య శిక్షణా కోర్సును ప్రారంభిస్తున్నామని స్మార్ట్ శిక్షణ కేంద్రం మేనేజర్ షేక్ మౌలానా అన్నారు. ఈ మేరకు సోమవారం పద్మారావునగర్, పార్సీగుట్ట బస్తీలలో ఇంటింటికీ వెళ్ళి ప్రచారం నిర్వహించారు. ఉచితంగా అందిస్తున్న నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పేద, మధ్య తరగతికి చెందిన పదో తరగతి పాసై, ఇంటర్, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయిన 19 ఏండ్ల నుంచి 27 ఏండ్లు ఉన్న నిరుద్యోగులకు మూడు నెలల పాటు ట్యాలీ, కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లిష్, టైపింగ్, ఇంటర్నెట్, రిటైల్ రంగాలలో ఉచిత శిక్షణ అందించి, ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నామని తెలిపారు. త్వరలో ప్రారంభమయ్యే నూతన బ్యాచ్‌లలో చేరడానికి ఆసక్తి ఉన్న అభ్యర్థులు సెల్ నం: 91549 90135, 84980 89786లో సంప్రదించాలని ఆయన కోరారు. గాంధీ దవాఖాన ఎదురుగా యాక్సిస్ బ్యాంక్ సమీపంలో ఎవర్‌గ్రీన్ కమ్యూనిటీ హాలులో తమ శిక్షణ కేంద్రానికి నేరుగా వచ్చి కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో అప్సా సిబ్బంది హరిప్రకాశ్, జయశ్రీ, విజయ్ ప్రతాప్, మహిత, వలంటీర్లు పాల్గొన్నారు.

శిల్పారామంలో జాతీయ చేనేత దినోత్సవం

మాదాపూర్ శిల్పారామంలో చేనేత కళాకారులకు సన్మానం చేసిన దృశ్యం

కొండాపూర్, ఆగస్టు 5: జాతీయ చేనేత దినోత్సవాన్ని సోమవారం మాదాపూర్‌లోని శిల్పారామంలో డెవలప్‌మెంట్ కమిషనర్ ఫర్ హ్యాండ్లూమ్స్, మినిస్టరీ ఆఫ్ టెక్స్‌టైల్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియాల సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 20 మంది జాతీయ అవార్డులు సొంతం చేసుకున్న చేనేత కళాకారులకు సన్మానం చేశారు. మినిస్టరీ ఆఫ్ టెక్స్‌టైల్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ అండ్ రీజినల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి అరుణ్ కుమార్ చేనేత పథకాల గురించి అవగాహన కల్పించారు. శిల్పారామం స్పెసల్ ఆఫీసర్ కిషన్ రావు, చేనేత కళాకారులు పద్మశ్రీ గజం అంజయ్య, గోవర్ధన్, శివ కుమార్, కొండా కవితారెడ్డి, హ్యాండ్లూమ్ క్యూరేటర్ విజయ లక్ష్మి తదితర ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

జల మండలి ఎఫ్‌డీ వాసుదేవ పదవీ విరమణ

జల మండలి ఫైనాన్స్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న వాసుదేవ నాయుడు స్వచ్ఛందంగా పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో నాయుడుకు వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్, ఫైనాన్స్ వింగ్ సీజీఎం చంద్రజ్యోతితో పాటు జల మండలి ఉద్యోగులు, సిబ్బంది హాజరై ఆయనను శాలువాలు, బోకేలు, పూలమాలలతో సత్కరించారు.

– సిటీబ్యూరో, ఆగస్టు 5(నమస్తే తెలంగాణ)

వయనాడ్ ప్రకృతి విలయాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

హిమాయత్‌నగర్‌లో వరద బాధితుల కోసం విరాళాల సేకరణ చేస్తున్న సీపీఐ నాయకులు

హిమాయత్‌నగర్,ఆగస్టు5: వయనాడ్ ప్రకృతి విధ్వంసాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. హిమాయత్‌నగర్‌లో వయనాడ్ వరద బాధితుల సహాయార్థం విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఊహించని వరదలతో కొండ చరియల్ విరిగిపడి సర్వం కోల్పోయిన బాధితులు ఆదుకునేందుకు ప్రతి ఒక్కరు విరాళాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ విపత్తులో నష్టపోయిన వారికి అవసరమైన సహాయాన్ని అందించడంలో మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రకృతి విపత్తుతో నిర్వాసితులుగా మారిన కుటుంబాలకు అండగా నిలవాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈ.టీ.నరసింహ, నగర కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, బి.స్టాలిన్, నాయకులు కంపల్లి శ్రీనివాస్, ఎండి సలీం, నరేష్,ఆరుట్ల రాజ్ కుమార్, ఇమ్రాన్, సహానా అంజుమ్, జె.కుమార్, నజీబ్, లెనిన్, ఆశ్విన్, తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో రోగ నిరోధక శక్తిని పెంచడంలో..

తల్లి పాలకు మించిన టీకా లేదు

రాజేంద్రనగర్ సీహెచ్‌సీ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డా.దుర్గాలత

సిటీబ్యూరో, ఆగస్టు 5(నమస్తే తెలంగాణ): తల్లిపాలు పిల్లలకు అమృతం వంటివి, రోగ నిరోధక శక్తిని పెంచడంలో తల్లిపాలకు మించిన టీకాలు లేవని రాజేంద్రనగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గాలత అన్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి ఏడో తేదీ వరకు నిర్వహిస్తున్న ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం రాజేంద్రనగర్ సీహెచ్‌సీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందుకు ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి, మాట్లాడుతూ, తల్లిపాలలో ఉండే పోషకాలు, వ్యాధి నిరోధక శక్తి శిశువులకు జీవితాంతం పనిచేస్తాయన్నారు. పుట్టిన గంటలోపు శిశువులకు తప్పనిసరిగా ముర్రుపాలు తాగించాలని, శిశువుకు మూడేళ్ళ వయస్సు వచ్చే వరకు తల్లిపాలు పట్టడం తల్లీబిడ్డ ఇద్దరికీ క్షేమమన్నారు. పిల్లలకు పాలు పడితే శిశువుతో పాటు తల్లి ఆరోగ్యానికి కూడా అన్ని విధాల ఆరోగ్యకరమన్నారు. కరోనా వంటి భయంకరమైన వైరస్‌లు వచ్చినప్పుడు శిశువులకు తల్లిపాలు రక్షణగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డాక్టర్ సమీనా, హెడ్ నర్సు పద్మ, మరియ, స్టాఫ్ నర్స్ సుజాత పాల్గొన్నారు.